క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ సైదారావు

కడెం: ప్రమాదాల నివారణకు వాహనదారులు విధి గా ట్రాఫిక్ నిబంధనలు పాటించా లని ఖానాపూర్ సీఐ సైదారావు అన్నారు. ఆ దివారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఫోన్ మా ట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. అన్ని పత్రాలు వెంట ఉంచుకోవాలని సీఐ సూచించారు. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

భూమిపూజ



భూమిపూజ చేస్తున్న పోతన్నయాదవ్

ముధోల్: మండల కేంద్రంలో ఆదివారం జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాల నిర్మాణానికి విగ్రహ కమిటీ అధ్యక్షులు పోతన్నయాదవ్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మూఢ నమ్మకాలను పారద్రోలి సమాజానికి వెలుగు ప్రసాదించిన మహాత్ములు పూలే దంపతులని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజేందర్, అనిల్, నారాయణ్, మాజీ ఎంపీపీ అజాజుద్దీన్, ఖాలీద్‌పటేల్, ఎంపీటీసీ దేవోజీ భూమేశ్, తదితరులు ఉన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయించిన ఎంపీటీసీ

కుంటాల: మండలంలోని కుంటాల-అంబకంటి రోడ్డు కంకరతేలి గుంతలమయంగా మారింది. వాహనదారులు, పాదాచారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం అంబకంటి ఎంపీటీసీ సుధాకర్ సొంత ఖర్చులతో గుంతల్లో మొరం వేయించి ఇబ్బందులను తొలగించారు. ఎంపీటీసీకి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

'చలో ఢిల్లీ'లో నిర్మల్ నేతలు



నిరసనలో పాల్గొన్న సయ్యద్ హైదర్

నిర్మల్‌టౌన్: అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా ఆదివారం చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ నిర్మల్ జిల్లా కన్వీనర్ సయ్యద్ హైదర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడాతూ ఢిల్లీ ముఖ్యమంత్రి క్రేజీవాల్‌కు మద్దతుగా చలో ఢిల్లీ నిర్వహించినట్లు చెప్పారు. ఆయన అక్రమ అరెస్టును ఖండించారు. వారి వెంట పలువురు నాయకులు ఉన్నారు.

ముగిసిన హరినామ సప్తాహం



ప్రవచనాలు చెబుతున్న మహరాజ్

తానూరు: మండంలంలోని భోసి గ్రామంలో వారం రోజులుగా లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహం ఆదివారం ముగిసింది. ఉదయం వీధుల్లో ఊరేగింపు అనంతరం కాళ్యకీర్తన కార్యక్రమంలో పోచయ్య మహరాజ్ పాల్గొని భక్తులకు పలు ప్రవచనాలు చెప్పారు. ప్రతి ఒక్కరూ తులసీమాలలు ధరించి వార్‌కరిగా మారాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరం ఉంటూ సన్మార్గంలో నడవాలన్నారు. అనంతరం ఉట్టి కొట్టి ప్రసాదం పంపిణీ చేశారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రాందాస్ మహరాజ్, సుభాశ్ పటేల్, గంగాధర్ లింగా, వీడీసీ అధ్యక్షులు ఉత్తం బాలేరావ్, మాజీ సర్పంచ్ శివరాత్రి ఆనంద్, నాగన్న, రాజు, మల్లయ్య, జైప్రకాశ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ముధోల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్న త పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్‌భవన్‌లో జరిగిన జిల్లా స్థాయి రెండో విడత కరాటే పోటీల్లో పాఠశాల విద్యార్థులు సరయు, శ్రీనిధి ప్రతిభ కనబరిచి కాంస్యం, బంగారు పతకాలు సాధించారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని ఆకాక్షించారు.

నాడు తోటలో.. నేడు కాలనీలో

- నిర్మల్‌లో 41ఏళ్లుగా పూజలు అందుకుంటున్న తొలి దత్తాత్రేయుడు
- నేటి నుంచి నూతన ఆలయ, విగ్రహప్రతిష్ఠాపనోత్సవాలు
- దత్తాత్రేయనగర్‌లో ఘనంగా ఏర్పాట్లు



40ఏళ్ల క్రితం పూజలందుకుంటున్న స్వామివారు



నూతనంగా నిర్మించిన దత్తాత్రేయ ఆలయం

నిర్మల్: 'ఇప్పుడంటే పెద్దపెద్ద రోడ్లు, బిల్డింగులు, ఎటుచూసినా పెద్ద దుకాణాలయ్యాయి కానీ.. ఒకప్పుడు ఇక్కడ కనుచూపు మేరంతా చేన్లు, తోటలే ఉంటుండే. చౌరస్తా నుంచి ఇటువైపు రావడానికి కూడా భయపడేవారు. అప్పట్లో మహారాష్ట్ర నుంచి వచ్చిన నామ్‌దేవ్ అనే మహరాజ్ చెప్పినట్లు తోటలోనే దత్తాత్రేయుడికి చిన్నగా గుడి కట్టుకున్నం. అప్పటి నుంచి నిత్యం పూజలు చేసుకుంటూ వస్తున్నం. కాలక్రమంలో చేన్లు, తోటలు పోయినై. ఇప్పుడు నిర్మల్‌లోనే ఈ ఏరియా చాలా ఖరీదైపోయింది. ఊరు మారినట్లే.. దత్తాత్రేయుడి గుడి కూడా కొత్తగా రూపుదిద్దుకోవడం చాలా ఆనందంగా ఉంది..'అంటూ స్థానిక దత్తాత్రేయనగర్‌లోని దత్తాత్రేయ ఆలయ వ్యవస్థాపకుడు, స్థలదాత ద్యావరశెట్టి ఇస్తారి పేర్కొన్నారు.

ఒకప్పుడు ఊరిచివర తోటలో కొలువై పూజలందుకున్న దత్తాత్రేయుడికి అదేచోట కొత్తగా సుందరమైన గుడి నిర్మాణమైంది. ఆలయంతో పాటు నూతన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి.

తొలి దత్తాత్రేయుడు..

భక్తి ఉద్యమకాలం నుంచే మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో ఉన్న నిర్మల్‌లోనూ ఆధ్యాత్మిక పరంపర పెరుగుతూ వచ్చింది. ప్రధానంగా గురుపరంపరలో భాగంగా దత్తాత్రేయుడి ఆరాధన ప్రజల్లో పెరిగింది. 450 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన నిర్మల్ పట్టణంలో తొలి దత్తాత్రేయ ఆలయం ప్రస్తుత దత్తాత్రేయనగర్‌లోనే ఏర్పాటైనట్లు తెలుస్తోంది. అప్పట్లో వెంకటాద్రిపేటకు చెందిన ద్యావరశెట్టి పోసాని, ఇస్తారి దంపతులు ఇక్కడి తమ వ్యవసాయక్షేత్రంలో సాగు చేసుకునేవారు. 1983లో మహారాష్ట్ర నుంచి వచ్చిన నామ్‌దేవ్ మహరాజ్ చేసిన సూచన మేరకు తమ పంట భూమిలోనే దత్తాత్రేయుడికి ఆలయాన్ని కట్టించారు. నిత్యం సాగు చేసే ముందు గురుదత్తుడికి పూజలు చేసేవారు. అలా 41ఏళ్లుగా.. నిర్మల్ తొలి దత్తాత్రేయ ఆలయంగా.. ఇక్కడ పూజలందుకుంటున్నాడు. ప్రతీ ఏడాది దత్త జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నారు.

నాలుగు రోజుల పాటు..

నూతన ఆలయంలో దత్తాత్రేయుడితో పాటు శివాలయం, ఆంజనేయస్వామి, నవగ్రహ ఆలయాలూ ఉన్నాయి. విగ్రహ ప్రతిష్ఠాపన, నూతన ఆలయ ప్రారంభోత్సవం సోమవారం నుంచి నాలుగురోజులు కొనసాగనున్నాయి. తొలిరోజు గణపతిపూజ, ప్రతిమశోధన, దేవతామూర్తుల ఊరేగింపు ఉంటాయి. మంగళవారం స్వస్తిపుణ్యహవచనం, రక్షసూత్రధారణ, బ్రాహ్మణవరణం, యాగశాల ప్రవేశం, అఖండ దీపస్థాపన ఉంటాయి. బుధవారం రుద్ర హోమం, చండీహోమం, శ్రీదత్తమూలమంత్ర, ధాన్యాదివాసం, సామూహిక కుంకుమార్చన నిర్వహించనున్నారు. చివరిరోజైన గురువారం మహాగణపతి పూజ, యంత్ర విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ ద్రుక్‌బలి, మహాపూర్ణహుతి, కుంభాభిషేకం, ముత్యాల తలంబ్రాలతో శివపార్వతుల కల్యాణోత్సవం, పల్లకిసేవ ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. నూతన ఆలయం, విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతీస్వామి చేతుల మీదుగా కొనసాగనున్నాయి.

తోటలు పోయి.. కాలనీగా మారి..

గొలుసుకట్టు చెరువులకు ఆలవాలమైన నిర్మల్ చు ట్టూ తోటలు, చేన్లు కూడా ఉండేవి. కాలక్రమంలో అవన్నీ కాలనీలుగా మారిపోయాయి. ప్రస్తుతం దత్తాత్రేయనగర్, ఏఎన్‌రెడ్డి కాలనీ ప్రాంతం నిర్మల్‌లోనే అత్యంత ఖరీదైన ఏరియాలుగా మారాయి. కా లనీ పెరిగిపోవడంతో అప్పటి చిన్నగుడిని పెద్దగా కట్టాలని స్థానికులు నిర్ణయించుకున్నారు. దీనికి వ్య వస్థాపకులూ సరే అనడం, నూతన ఆలయ నిర్మాణానికి దేవాదాయశాఖ నుంచి రూ.50లక్షల నిధులు మంజూరు కావడంతో కొత్త ఆలయం సుందరంగా నిర్మాణమైంది. ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా కాలనీవాసులంతా దత్తాత్రేయ మాలలు వేసుకుని, గురుదత్త దీక్షను స్వీకరించడం విశేషం.

దత్తాత్రేయుడి ఆశీస్సులతోనే..



అప్పట్లో నిర్మల్‌లో దత్తాత్రేయుడి ఆలయం లేదు. మహారాష్ట్ర నుంచి వచ్చిన మహరాజ్ చెప్పినట్లు ఆలయ నిర్మాణం చేపట్టి, నిత్యపూజలు చేశాం. ఆ దత్తాత్రేయుడి ఆశీస్సులతో అనుకున్నవన్నీ జరిగాయి. గురుదత్తుడికి కొత్త ఆలయం నిర్మాణం కావడం ఆనందంగా ఉంది.

– ద్యావరశెట్టి పోసాని, ఇస్తారి

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

సారంగాపూర్: మండలంలోని జామ్ గ్రామంలో తుల సుదర్శన్ అనే రైతుకు చెందిన ఎద్దు ఆదివారం విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేస్తుండగా తక్కువ ఎత్తులో ఉన్న 11కేవీ విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు గమనించి విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో విద్యుత్ సరఫరా నిలిపివేసినా అప్పటికే పశువు మృతి చెందింది. మృతి చెందిన ఎద్దు విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని బాధిత రైతు రోదిస్తూ తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ



హథ్‌గాంలో పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రామారావ్

లోకేశ్వరం: మండలంలోని హథ్‌గాం గ్రామంలో నరేశ్, బిలోలిలో సాయన్న, రాజేశ్వర్, నాని వివిధ కారణాలతో మృతి చెందారు. ఆదివారం బాధిత కుటుంబసభ్యులను ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట రవీందర్, అనిల్, సాయినాథ్ పటేల్, గణేశ్ ఉన్నారు.

సన్మానం

ఖానాపూర్: ఇటీవల మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన చిన్నం సత్యం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికై న మంత్రరాజం సురేశ్‌ను మండలంలోని గోసంపల్లె గ్రామానికి చెందిన నాయకులు ఆదివారం శాలువాలతో సన్మానించారు. పట్టణంలోని వారి నివాసాల్లో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు తినిపించారు. సత్తనపల్లి పీఏసీఎస్ చైర్మన్ అమంద శ్రీనివాస్, తుదిగేని రాజలింగు, సైకిలాబ్, మధు తదితరులున్నారు.

మలుపులు.. ప్రమాద పిలుపులు



కుభీర్ శివారులో బెల్గాం రోడ్డు వద్ద ప్రమాదకరంగా మలుపు



మండల కేంద్రంలోని దొడర్నా వెళ్లే మార్గంలో..



కుభీర్ శివారులోని పార్డి(కె) వెళ్లే మార్గంలో

- రాకపోకలకు ప్రయాణికుల ఇబ్బందులు
- కానరాని హెచ్చరిక బోర్డులు
- రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు వేడుకోలు

కుభీర్: మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్డు మార్గంలో మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. కనీసం హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేయకపోవడంతో ఎదురుగా వాహనాలను ఢీకొడుతూ పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆయా గ్రామాల్లో ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి నివారణ చర్యలను చేపట్టడంలో అధికారులు విఫలం అవుతున్నారు.

మండల కేంద్రంలో ఏడు మలుపులు..

మండల కేంద్రంలో ఏడు ప్రమాదకర మలుపులున్నాయి. దీంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కుభీర్ నుంచి బెల్గాం వెళ్లే మార్గంలో మండల కేంద్రంలో శివారులో ఉన్న శ్మశానవాటిక మలుపు వద్ద వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. డొడర్నా వెళ్లే మార్గంలో కుభీర్ శివారులో ఉన్న దోబీ ఘాట్ వద్ద మలుపు ప్రమాదకరంగా ఉంది. కుభీర్ శివారులో వివేకానంద చౌరస్తా వద్ద పార్డి(కె) వెళ్లే మార్గంలో మలుపు ఉంది. కుభీర్‌లో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద మలుపు ఉంది. కుభీర్ నుంచి పల్సి వెళ్లే మార్గంలో పల్సిలో మలుపు ఉంది. సొనారి ఎక్స్‌రోడ్డు నుంచి మాలేగాం వెళ్లే మార్గంలో వర్ని వద్ద, కుప్టి గ్రామం వద్ద మలుపులు ఉన్నాయి.

హెచ్చరిక బోర్డులేవి..

గ్రామాల్లో ప్రమాదాలు జరిగే మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు కరువయ్యాయి. దీంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా రాత్రివేళ అదుపుతప్పి కింద పడుతున్నారు. ఏయే గ్రామానికి ఎన్ని కిలోమీటర్లో అని చెప్పే సూచికబోర్డులు కూడా లేవు. దీంతో వాహనాదారులు కొంత ఇబ్బంది పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ఆయా గ్రామాల్లో మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించడం లేదు. అధికారులు స్పందించి మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. రోడ్లపైకి వచ్చే చెట్ల కొమ్మలను కూడా తొలగించాలి. సూచిక బోర్డులూ ఏర్పాటు చేయాలి. – బి.శంకర్, పార్డి(కె)

ఇబ్బంది పడుతున్నాం



మలుపుల కారణంగా రాత్రి వేళ రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నాం. రోడ్ల నిర్మాణ సమయంలో ఇరువైపులా గ్రావెల్ వేస్తూ రోడ్లపైకి వచ్చే చెట్లకొమ్మలను తొలగించి ప్రమాదాలు జరగకుండా చూడాలి. – ఉప్పు దత్తాత్రి, కుభీర్

ఏర్పాటు చేయిస్తాం

గ్రామాల్లో ప్రమాదకరంగా ఉన్న మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయిస్తాం. ఇప్పటికే పలు గ్రామాల్లో రోడ్లపైకి వచ్చే చెట్ల కొమ్మలను తొలగించాం. ఇంకా ఎక్కడైనా ఉంటే మాకు సమాచారం ఇవ్వండి.. సిబ్బంది చేత తొలగింపజేయిస్తాం.
– రఘు, ఆర్‌అండ్‌బీ ఏఈ, కుభీర్

పన్నులు వసూలు చేసిన అధికారులు



రదును అందజేస్తున్న కమిషనర్ రాజు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో ఆదివారం మున్సిపల్ అధికారులు ఇంటి పన్నులను వసూలు చేశారు. ఆర్థిక సంవత్సరం ముగింపునకు ఆదివారం చివరిరోజు కావడంతో మున్సిపల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి పన్నులు వసూలు చేశారు. ప్రభుత్వం 90శాతం వడ్డీ మాఫీ ప్రకటించడంతో గతంలో పన్నులు చెల్లించని వారు వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, రెవెన్యూ అధికారులు శ్రీనివాస్, షకీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి'



మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి నగేశ్

కడెం: ప్రధాని మోదీతోనే దేశం అభివృద్ధి చెందుతుందని బీజేపీ ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి నగేశ్ అన్నారు. ఆదివారం మండలంలోని కొండుకూర్ గ్రామంలో ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని కార్యకర్తలు, నాయకులకు సూచించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అధిక మెజార్టీతో తనను ఆదిలాబాద్ ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ రాథోడ్‌రమేశ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, అయ్యన్నగారి భూమయ్య, మండలాధ్యక్షుడు కాశవేని శ్రీనివాస్, రవీందరగౌడ్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యవర్గాల ఎన్నిక



వద్యాల్‌లో ఎన్నిక పత్రం అందిస్తున్న రాజేశ్వర్

లక్ష్మణచాంద: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బోరిగాం గ్రామ అధ్యక్షుడిగా మాదస్తు భీమన్న, ఉపాధ్యక్షుడిగా ప్రేమ్‌సింగ్, ప్రధాన కార్యదర్శిగా నరేశ్, బాబాపూర్‌లో గ్రామ అధ్యక్షుడిగా తునికి నారాయణ, ప్రధాన కార్యదర్శిగా అంజయ్య, నర్సాపూర్‌లో గ్రామ అధ్యక్షుడిగా ముత్యం రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గొల్ల రమేశ్, వద్యాల్‌లో గ్రామ అధ్యక్షుడిగా రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మేర గోవర్ధన్, ప్రధాన కార్యదర్శిగా పుట్టి సాగర్, కోశాధికారిగా కిరణ్ ఠాగూర్‌ను ఎన్నుకున్నట్లు మండలాధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో ఈటెల శ్రీనివాస్, పోతారెడ్డి, గంగాధర్‌గౌడ్, నాగేశ్, శేఖర్‌రెడ్డి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ బోనాల పండుగ



బోనాలతో గ్రామస్తులు, ఆకట్టుకున్న విన్యాసం

ఖానాపూర్: పట్టణంలోని గోదావరి తీరంలో శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం కొనసాగుతోంది. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పోచమ్మ బోనాల పండుగ నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు తరలివచ్చి అమ్మవారికి బోనాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అమరవేణి శంకర్ గౌడ్, బుర్ర రాజారాం గౌడ్, దుర్గం వెంకాగౌడ్ తదితరులు ఉన్నారు.

మానవత్వం చాటిన ముధోల్ ఎస్సై

ముధోల్: ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని సకాలంలో ఆస్పత్రికి తరలించి ఎస్సై సాయికిరణ్ మానవత్వం చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ఆదివారం హైదరాబాద్ నుంచి కల్లూర్‌కు వెళ్తున్న టాటా వాటర్ బాటిల్ ఐచర్ వాహనం ముధోల్‌లోని భారత్ పెట్రోల్‌బంక్ వద్ద అదుపు తప్పి పొలాల్లో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ తీవ్ర గాయాలపాలయ్యాడు. అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో ఎస్సై స్పందించి అతడిని పోలీస్ వాహనంలో భైంసా ఏరియా స్పత్రికి తరలించారు. క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించిన ఎస్సైని పలువురు అభినందించారు.

కనుల పండువగా వార్షికోత్సవం



బోనాలతో ఆలయానికి వస్తున్న గ్రామస్తులు

కుంటాల: మండలంలోని అందాకూర్ గ్రా మంలో ఆదివారం మహాలక్ష్మి, ముత్యాలమ్మ, అడెల్లి మహాపోచమ్మ, బద్దిపోచమ్మ, చి లకల చిన్నమ్మ, పోతరాజు ఆలయాల మొదటి వా ర్షికోత్సవం కనుల పండువగా నిర్వహించా రు. మహిళలు మంగళహారతులు, డప్పు చప్పుళ్ల నడుమ బోనాలు ఎత్తుకొని ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సదాశివ్ పంతులు, వీడీసీ చైర్మన్ మహేశ్వర్‌రావు, ఎంపీటీసీ మధుకర్, మాజీ సర్పంచ్ దాసరి కిషన్, శ్రీధర్, సాయి శ్రీధర్‌రావు, లక్ష్మణ్, ముత్యం, అశోక్ పాల్గొన్నారు.

14న అయ్యప్ప విషు పూజ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సభ్యులు

నిర్మల్‌టౌన్: ప్రతి సంవత్సరం శబరిమలై అయ్యప్ప ఆలయంలో నిర్వహించే విషుపూజ ఈనెల 14న జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్‌లో నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప సేవా సమితి సభ్యులు తెలిపారు. ఈసందర్భంగా పూజకు సంబంధించిన కరపత్రాలను స్థానిక శ్రీకష్ణ మందిర్‌లో ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బుక్క కిట్టు గురుస్వామి(హైదరాబాద్) పాల్గొంటారని.. భక్తులు తరలిరావాలని కోరారు. మధ్యాహ్నం అన్నదానం, రాత్రి ఏడు గంటలకు మహా పడిపూజ ఉంటుందని తెలిపారు. అయ్యప్ప సేవాసమితి నిర్మల్ అధ్యక్షుడు బద్రి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కనపర్తి విగ్నేశ్, కోశాధికారి ముక్క రాజు భక్తులు పాల్గొన్నారు.

నూతన నియామకం

ఖానాపూర్: సర్వడే గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అసోషియేషన్ ఖానాపూర్ మండల ప్రధాన కార్యదర్శిగా షేర్ భూమేశ్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు తుల సీరాం తెలిపారు. ఆదివారం పట్టణంలో జరిగిన సమావేశంలో భూమేశ్‌కు ఐడీ కార్డు అందజేశారు. రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్ ఆదేశాల మేరకు నూతనంగా ఎన్నికైన సభ్యులకు ఐడీలు అందజేసినట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో మండలాధ్యక్షుడు ములంకల మురళీధర్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌కు రాజీనామా

దస్తురాబాద్: వ్యక్తిగత కారణాలతో కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తున్నట్లు మండలంలోని పేర్కపల్లెకు చెందిన పేరుక సంఘం జిల్లా అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ చుంచు భూమన్న ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ నాయకులు అనుసరిస్తున్న ఏకపక్ష విధానాలకు నిరసనగా పార్టీ వీడుతున్నట్లు పేర్కొన్నారు.